# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం | 8 మే 2025 | పేజీలు 8


## కేంద్ర జల సంఘం ఛైర్మన్‌తో ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ

- మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ, ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై చర్చ
- కృష్ణాపై టెలిమెట్రీల ఏర్పాటుకు నిధులు కేటాయించినట్లు వెల్లడి
- పాలమూరుకు 45, సమ్మక్క-సారక్కకు 44 టీఎంసీల కేటాయింపునకు విజ్ఞప్తి
- పోలవరం బ్యాక్ వాటర్ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన జల వివాదాలు, ప్రాజెక్టుల పురోగతి, నీటి కేటాయింపులపై

-మిగతా 4లో








లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు దొరికిపోయిన ప్రగతినగర్ ఏఈ ఎ.జ్ఞానేశ్వర్..

## కరెంట్ ఉద్యోగికి...
# ఏసీబీ షాక్

### లంచం తీసుకుంటూ దొరికిపోయిన ప్రగతి నగర్ ఏఈ జ్ఞానేశ్వర్..

- టిజిఎస్‌పిడిసిఎల్ జీడిమెట్ల డివిజనల్ ఇంజనీర్ పరిధిలోని ప్రగతినగర్..
- 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్ 9 విద్యుత్ మీటర్ల ఇన్‌స్టాలేషన్‌పై ఏఈ కక్కుర్తి..
- రూ.50వేలు డిమాండ్ చేసిన ఏఈ జ్ఞానేశ్వర్ రూ.10 వేలకి బేరం కుదిరింది..
- బాధితుడు విద్యుత్ కాంట్రాక్టర్‌గా ఉన్నట్లు సమాచారం..
- ఇదేవిధంగా తర్వాత ఏఈ అడ్డు పడుతాడనే భయంతో ఏసిబిని సంప్రదించాడు..
- రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసిబి డిఎస్‌పి ఆనంద్ ఆద్వర్యంలో రైడ్స్..

-2లో

### ఇకపై మరింత దూకుడు..నేడు హైడ్రా
## పోలీస్ స్టేషన్ ప్రారంభం..




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల పరిరక్షణే భాగంగా ఏర్పాటైన హైడ్రా.. మరింత పటిష్టమవుతోంది. ఆక్రమణ దారుల ఆటలు కట్టించేందుకు అధికారికంగా సిద్ధమైంది. దురాక్రమణలకు పాల్పడితే కటకటాల పాలుకేనని హెచ్చరించడమే కాకుండా.. అందుకు సంబంధించి ప్రత్యేక స్టేషన్ ను సిద్ధం చేసింది. ఇప్పటి వరకు స్టేషన్ లేకుండానే కబ్జాదారులను గడగడలాడించిన హైడ్రాకు సంబంధించిన మొట్టమొదటి పోలీస్ స్టేషన్ గురువారం (మే 8) సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభమవుతోంది.
హైదరాబాద్ లోని బుద్ధభవన్ పక్కనే హైడ్రా పోలీసు స్టేషన్ ను ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్ కు ఎస్‌హెచ్‌వోగా ఏసీపీ తిరుమల్ వ్యవహరిస్తారు. కొత్తగా ఏర్పాటు చేసిన స్టేషన్ కు ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు

-4 లో

## ఆక్రమణలు తొలగించి..
## ప్రభుత్వ భూమి స్వాధీనం..

### రెండు రోజుల్లో 15-30 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన హైడ్రా..

- గాజులరామారం సర్వే నెం.354 ప్రభుత్వ భూమికి కబ్జాదారుల నుండి విముక్తి..
- స్వాధీన పరుచుకున్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు..
- ఆ 15-30 ఎకరాలకు ముళ్ళ కంచెను అమర్చిన అధికారులు..




సర్వే నెం.354 ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు..

-3 లో

## హైవేను కలిపే రోడ్డుకు..
## అడ్డంకులు తొలగించిన హైడ్రా..

### ఎన్.హెచ్ 44కు చేరుకునే దారికి అడ్డంకిగా నరసింహారెడ్డి గేట్ల నిర్మాణం..

- మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్ మండలంలో రెండు గ్రామాలని కలిపే దారికి ఆటంకం..
- రహదారిని మూసేశారంటూ స్థానికుల ఫిర్యాదు హైడ్రా క్షేత్రస్థాయి పరిశీలన..
- రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని నిర్ధారణ..
- కండ్లకోయ సర్వే నెం. 135, 136లో జిల్లా న్యాయస్థాన సముదాయానికి కేటాయింపు..
- మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలకి కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు..
- హైడ్రా చొరవతో రహదారి అడ్డంకులు తొలగింపుతో స్థానికులు హర్షం..



-4 లో






లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు దొరికిపోయిన ప్రగతినగర్ ఏఈ ఎ.జ్ఞానేశ్వర్..

# కరెంట్ ఉద్యోగికి... ఏసీబీ షాక్

## లంచం తీసుకుంటూ దొరికిపోయిన ప్రగతి నగర్ ఏఈ జ్ఞానేశ్వర్..

### నిబంధనలు పాటించకుండానే ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు..

జీడిమెట్ల డివిజనల్ ఇంజనీర్ పరిధిలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. గాజులరామారం, ప్రగతినగర్, దుండిగల్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో నిర్మించే అక్రమ కట్టడాలకు ఈ విద్యుత్ మీటర్లే కీలకంగా మారుతున్నాయి.. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు మీటర్లు ఇవ్వకూడదని నిబంధనలు అతిక్రమించి విద్యుత్ అధికారులు, వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు లేకపోలేదు.. నిర్మాణ అనుమతులు లేకపోయినా..! ఇంటి నెంబర్ లేకపోయినా, పర్మిషన్‌లతో నిర్మించిన భవనాలకు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తప్పనిసరి అయినప్పటికీ, విద్యుత్ అధికారులు ఇవేమి పట్టించుకోకుండా..! ముడుపులకే ప్రాధాన్యత ఇస్తూ.. ఇలా ఏసిబి అధికారులకు దొరికి పోతున్నారు.. ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లు సంబంధిత భవన నిర్మాణ ఆవరణలోనే పెట్టాలనే నిబంధనలకు తిలోదకాలు పలుకుతున్నారు.. రోడ్లపైనే ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి భవిష్యత్తు ప్రమాదాలకు పునాదులు వేస్తున్నారు..



ప్రగతినగర్ విద్యుత్ ఏఈ కార్యాలయంలో ఏసిబి సోదాలు..



రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసిబి డిఎస్‌పి ఆనంద్.. పత్రికా సమావేశంలో..

ఇప్పటికైనా
విద్యుత్ విజిలెన్స్ అధికారులు
కార్యాలయాలకే పరిమితం కాకుండా..!
ఫిర్యాదుల కోసం ఎదురు చూడకుండా..! ఆయా ప్రాంతాలు పర్యవేక్షిస్తూ, అవినీతి అధికారులపై నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు.. అదేవిధంగా విజిలెన్స్ నిర్లక్ష్యం, అలసత్వంపై "టిజిఎస్‌పిడిసిఎల్" ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.. ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేసిన పత్రాలని పరిశీలిస్తే, ప్రమాదాల నియంత్రణకి దోహదపడుతుంది.. అదే సమయంలో ఇలాంటి అవినీతి అధికారులకు చెక్ పెట్టవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు..

విద్యుత్ శాఖలో అవినీతి అధికారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.. అలాగని అందరిని తప్పుపట్టలేము.. కొద్దిరోజుల క్రితమే(2025 మార్చి 27న) ఇదే జీడిమెట్ల డివిజనల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి విద్యుత్ ఏఈ సురేందర్ రెడ్డి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసిబికి పట్టుబడిన విషయం తెలిసిందే..! ఇది జరిగి 40 రోజులు గడవక ముందే, బుధవారం ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ ఏసిబికి పట్టుబడటం గమనార్హం.. మరోవైపు విద్యుత్ ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లకి, ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌ల సైట్ వెరిఫికేషన్‌తో పాటు, అదనంగా మీటర్ల మంజూరులో తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు స్పష్టతను ఇస్తున్నాయి.. మరోవైపు ఒకే డివిజనల్ ఇంజనీర్ పరిధిలో ఈ రెండు ఘటనలు చోటు చేసుకోవడం డీఈ, ఏడీఈల పర్యవేక్షణ కూడా లేదని స్పష్టంగా కనిపిస్తుంది.. ఇక విద్యుత్ విజిలెన్స్ అధికారులు కూడా ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన కథనాలపై ఫీల్డ్ విజిట్ చేసినప్పటికీ, చర్యలు తీసుకోకుండా సైలెంట్‌గా ఉంటున్నారు.. సూరారం కాలనీలోని ఓ అక్రమ నిర్మాణానికి సహకరించిన (మార్చి 27న ఏసిబికి పట్టుబడిన ఏఈ) విద్యుత్ అధికారి అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు తో రుజువైంది.. తమ చేతివాటం ప్రదర్శించి ట్రాన్స్‌ఫార్మర్ సాంక్షన్ చేశారని "పెన్ పవర్" దినపత్రికలో వచ్చిన శీర్షికతో ఏడీఈ, డీఈ, టిజిఎస్‌పిడిసిఎల్ దృష్టికి తీసుకెళ్ళినా సంబంధిత అక్రమ ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డుపైనే ఏర్పాటు చేయడం విశేషం.. ఏదిఏమైనప్పటికీ ఆవు చేలోమేస్తే దూడ గట్టున మేస్తుందా ఏంటి..?

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 7:

జీడిమెట్ల డివిజనల్ ఇంజనీర్ పరిధి ప్రగతినగర్ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో ఏఈ జ్ఞానేశ్వర్ ఏసిబి అధికారులకు లంచం తీసుకుంటూ, ఉన్నపళంగా దొరికారు.. బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో కార్యాలయంలోనే జ్ఞానేశ్వర్ రూ.10 వేలు తీసుకుంటూ రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసిబి డిఎస్‌పి ఆనంద్ టీమ్‌కి దొరికిపోయాడు.. ఏసిబి డిఎస్‌పి ఆనంద్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ..ప్రగతినగర్ విద్యుత్ కార్యాలయం సమీపంలోనే 63 కేవి ట్రాన్స్‌ఫార్మర్, 9 త్రి-ఫేజ్ మీటర్లు, ఇన్‌స్టాలేషన్ పూర్తైనట్లు దృవీకరించడానికి బాధితుని నుండి, ఏఈ జ్ఞానేశ్వర్ రూ.50 వేలు డిమాండ్ చేశారని, రూ.15 వేలు ఇవ్వమని ఏఈ ఫైనల్ చేయడంతో, బాధితుని రిక్వెస్ట్ మేరకు చివరికి రూ.10 వేలు ఒప్పందం కుదిరిందని ఏసిబి డిఎస్‌పి ఆనంద్ తెలిపారు.. బాధితుడు తరచు ఇలాంటి పనులు చేసే అవకాశం ఉన్నందున, తనకు ప్రతిసారీ ఏఈ జ్ఞానేశ్వర్‌తో ఇలాంటి ఇబ్బందులు తప్పవని భావించిన బాధితుడు, అవినీతి నిరోధక శాఖ అధికారులని సంప్రదించినట్లు ఏసిబి అధికారి ఆనంద్ పేర్కొన్నారు.. బాధితుని వివరాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన ప్రాంతం వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు ఏసిబి డిఎస్‌పి ఆనంద్ మీడియాకు తెలిపారు.. నిందితుడు ఏఈ జ్ఞానేశ్వర్‌పై గతంలో ఏమైనా ఇలాంటి కేసులు ఉన్నాయా లేవా అనే విషయాన్ని పరిశీలిస్తామని, ఆయన ఉంటున్న నివాసంలోనూ సోదాలు నిర్వహించి పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని డిఎస్‌పి ఆనంద్ తెలిపారు.. ఏఈ. ఎ.జ్ఞానేశ్వర్‌ను అరెస్టు చేసి, హైదరాబాద్‌లోని నాంపల్లిలోని ఎస్‌పిఈ, ఏసిబి కేసుల అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తున్నట్లు ఏసిబి అధికారి ఆనంద్ తెలిపారు.. కేసు దర్యాప్తులో ఉందని అన్నారు..

- టిజిఎస్‌పిడిసిఎల్ జీడిమెట్ల డివిజనల్ ఇంజనీర్ పరిధిలోని ప్రగతినగర్..
- 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్ 9 విద్యుత్ మీటర్ల ఇన్‌స్టాలేషన్‌పై ఏఈ కక్కుర్తి..
- రూ.50వేలు డిమాండ్ చేసిన ఏఈ జ్ఞానేశ్వర్ రూ.10 వేలకి భేరం కుదిరింది..
- బాధితుడు విద్యుత్ కాంట్రాక్టర్‌గా ఉన్నట్లు సమాచారం..
- ఇదేవిధంగా తర్వాత ఏఈ అడ్డు పడుతాడనే భయంతో ఏసిబిని సంప్రదించాడు..
- రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసిబి డిఎస్‌పి ఆనంద్ ఆద్వర్యంలో రైడ్స్..






సర్వే నెం.354 ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు..

# ఆక్రమణలు తొలగించి... ప్రభుత్వ భూమి స్వాధీనం

## రెండు రోజుల్లో 15-30 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన హైడ్రా..



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం డ్రోన్‌షాట్..

- గాజులరామారం సర్వే నెం.354 ప్రభుత్వ భూమికి కబ్జాదారుల నుండి విముక్తి..
- స్వాధీన పరుచుకున్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు..
- ఆ 15-30 ఎకరాలకు ముళ్ళ కంచెను అమర్చిన అధికారులు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మే 7:** కబ్జాదారుల ఎత్తుగడలను హైడ్రా అధికారులు చిత్తు చేశారు.. సుమారు 2 వేలకోట్లు విలువైన ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను కూల్చేసి, స్వాధీన పరచుకున్నారు.. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం శివారు లాల్‌సాబ్ గూడా గ్రామంలో ఉన్న, సర్వే నెం.354 ప్రభుత్వ భూమిని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కి కేటాయించాలని 2008 లో అప్పటి కలెక్టర్‌కి ప్రతిపాదనలు పంపించారు..! దీంతో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమితో పాటు, గాజులరామారం సర్వే నెం.354 లోని 15-30 ఎకరాల భూమిని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కి జీవో ఎంఎస్ నెం.318 ప్రకారం 2009లో కేటాయించారు.. అదికూడా నామినల్ ధరను నిర్ణయించి కొనుగోలు చేసిందే..! అయినప్పటికీ అధికారుల అలసత్వంతో సంబంధిత 15-30 ఎకరాల భూములు కబ్జాకు గురికావడం విశేషం.. అంతటితో ఆగకుండ ఆక్రమణ దారులు 1968లో అసైనీల వద్ద కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్‌లు చూపిస్తున్నారని, సివిల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు.. అయితే సంబంధిత ప్రభుత్వ భూమి ఏ అసైనీలకు కేటాయించ లేదని కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు స్పష్టతను ఇచ్చారు..



జేసిబితో హద్దుల తవ్వకాలు..

### స్వాధీన పరుచుకున్న స్థలం చుట్టూ ముళ్ళ కంచె.. హెచ్చరిక బోర్డు..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం విలేజ్‌లో 15-30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. సర్వే నెంబర్ 354లో ఉన్న ప్రభుత్వ భూమిలో కబ్జాలను హైడ్రా మంగళవారం తొలగించింది.. ఇందులో కేఎల్‌యూనివర్సిటీ కూడా 5 ఎకరాలు ఆక్రమించగా దాన్ని కూడా స్వాధీన పరచుకున్నారు.. వాస్తవానికి ఈ భూమిని రాజీవ్ స్వగృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం 2009లో కేటాయించింది. అక్కడ నిర్మాణాలు రాకపోవడంతో..ఈ భూమిపై స్థానికంగా నాయకులుగా చెలామణి అవుతున్న కబ్జాదారుల కన్ను పడింది.. తిలాపాపం తలాపిడికెడు అన్నచందంగా ఎవరికి వారు ప్రహరిగోడలు నిర్మించుకుని.. షెడ్డులు వేసి ఆక్రమణలకు పాల్పడ్డారని అన్నారు.. దీంతో స్థానికుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేయడంతో.. విచారణ చేపట్టిన హైడ్రా, క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే నిర్వహించింది..ప్రభుత్వ భూమిగా నిర్ధారణకు వచ్చిన, హైడ్రా బృందం, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఐపీఎస్‌కి నివేదించారు..మంగళవారం ఆక్రమణలు తొలగించి వెంటనే, బుధవారం ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.. ఈ నేపథ్యంలో ఆక్రమణలను మంగళవారం కూల్చేసిన అధికారులు అక్కడ వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమిగా బోర్డులు పెట్టారు.

- మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్ మండలంలో రెండు గ్రామాలని కలిపే దారకి ఆటంకం..
- రహదారిని మూసేశారంటూ స్థానికుల ఫిర్యాదు హైడ్రా క్షేత్రస్థాయి పరిశీలన..
- రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని నిర్ధారణ..
- కండ్లకోయ సర్వే నెం. 135, 136లో జిల్లా న్యాయస్థాన సముదాయానికి కేటాయింపు..
- మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలకి కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు..
- హైడ్రా చొరవతో రహదారి అడ్డంకులు తొలగింపుతో స్థానికులు హర్షం..



# హైవేను కలిపే రోడ్డుకు.. అడ్డంకులు తొలగించిన హైడ్రా..

## ఎన్.హెచ్ 44కు చేరుకునే దారికి అడ్డంకిగా నరసింహారెడ్డి గేట్ల నిర్మాణం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 7: రెండు గ్రామాలని కలిపే రహదారిపై ఆటంకాలను సృష్టించిన అక్రమార్కులకు హైడ్రా గుణపాఠం చెప్పింది.. మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్ మండలం దేవరయాంజల్, కండ్లకోయ ప్రజలు సులభంగా జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44కు చేరుకునే అవకాశం హైడ్రా కల్పించింది.. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారికి అడ్డంగా బండకుంట నరసింహారెడ్డి అనే వ్యక్తి గేట్లుపెట్టి, రోడ్డును కొంత మేర తవ్వేసి ఆటంకాలు సృష్టించగా.. బుధవారం హైడ్రా వాటిని తొలగించింది.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షామీర్పేట మండలం దేవరయాంజల్ విలేజికి ఉండే ప్రధాన రహదారిని మూసేశారంటూ స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా బృందం. రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని నిర్ధారించుకుంది.. కండ్లకోయ సర్వే నెంబర్ 135, 136 ప్రభుత్వ భూమిలో జిల్లా న్యాయస్థాన సముదాయానికి
కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.. అవే సర్వే నెంబర్ లలో మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నిర్మాణానికి కూడా కొంత స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది.. వీటి నిర్మాణం జరగాల్సి ఉండగా.. ఇప్పటికే ఈ మార్గంలో కొన్ని పరిశ్రమలు కూడా ఉన్నాయి. వీటితో పాటు కండ్లకోయ -దేవరయాంజల్ నివాసితులు కూడా ఇదే రోడ్డును వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండగా.. త్వరలో 40 అడుగుల విస్తీర్ణంలో తార్ రోడ్డు నిర్మించేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో రహదారిపై ఆటంకాలు సృష్టించడం ఏంటని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు.. అక్కడ నిర్మించిన గేట్లతో పాటు, రోడ్డుమీద అడ్డంగా వేసిన బండరాళ్లను హైడ్రా తొలగించింది. కందకం తవ్విన చోట మట్టిని నింపి రాకపోకలను పునరుద్ధరించింది. గూండాగిరితో రాకపోకలకు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని.. హైడ్రాను స్థానికులు కోరారు. ఫిర్యాదుచేసిన వారం రోజుల్లోనే ఆటంకాలను తొలగించిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.



# కేంద్ర జల సంఘం చైర్మన్‌తో ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ

- మొదటి పేజి తరువాయి

విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పలు ప్రతిపాదనలను ఆయన కేంద్రం ముందుంచారు.మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ అంశం ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. బ్యారేజీ మరమ్మతులు, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలసంఘం ఛైర్మన్‌కు వివరించారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం, డిజైన్‌లో స్పష్టమైన లోపాలున్నాయని ఆయన పేర్కొన్నారు.ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌లో ఒక ప్రాంతంలో నిర్మిస్తామని ప్రతిపాదించి, ఆచరణలో మరోచోట నిర్మాణం చేపట్టారని మంత్రి తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు సీడబ్ల్యూసీలో సమగ్రంగా చర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని, ఈ అంశంపై ప్రస్తుతం అధ్యయనం జరుగుతోందని ఆయన వెల్లడించారు. ప్రజాధనం ఏమాత్రం వృథా కాకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.కృష్ణా నదిపై టెలిమెట్రీల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన నిధులను ఇప్పటికే కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కి అందజేసినట్లు మంత్రి ఈ సందర్భంగా కేంద్ర జలసంఘం ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తొలి విడతకు 45 టీఎంసీల నీటిని, అలాగే సమ్మక్క-సారక్క బ్యారేజీకి 44 టీఎంసీల నీటిని కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా తెలంగాణ భూభాగంలో ఎదురయ్యే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నష్ట నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

### ఇకపై మరింత దూకుడు..నేడు హైడ్రా

# పోలీస్ స్టేషన్ ప్రారంభం..

- మొదటి పేజి తరువాయి

(సీఐలు), 12 మంది ఎస్ఐలు, 30 మంది కానిస్టేబుల్స్ కేటాయించారు. ఈ పోలీసు స్టేషన్ లో 10,500 ల చదరపు అడుగుల విస్తీర్ణం జీ ప్లస్ 2 గా నిర్మించారు. ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, చెరువులు, నాలాలను ఆక్రమించిన వారిపై ఇకనుంచి హైడ్రా పోలీసు స్టేషన్ లో కేసులు నమోదు చేసుకుంటారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలలో మట్టి పోసిన వారిపై కూడా హైడ్రా పీఎస్ లో కేసులు నమోదు చేస్తారు. చెరువుల్లోకి మురుగు నీరును నేరుగా వదిలిన వారిపైన కూడా కేసులు నమోదు చేయనున్నారు హైడ్రా అధికారులు.

# ఎండలో బండి భద్రం.. ఈ జాగ్రత్తలు పాటిస్తే మీ బండి సేఫ్. జర్నీ అంతకంటే సేఫ్..!

**హైదరాబాద్ పెన్ పవర్:**వేసవి కాలం వచ్చేసింది. ఎండలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు వేడి ప్రభావంతో కొన్ని సార్లు వాహనాలు దగ్ధమైన ఘటనలు చూస్తేనే ఉన్నం. ఇంజిన్ బాగా వేడెక్కడం, పెట్రోల్ లీకవడం వంటి కారణాల వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతాయి. అందుకే వేసవిలో వాహనదారులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏ టైర్లలో ఎంత గాలి ఉండాలో వాహన తయారీదారుల సూచనలు ఫాలో అవ్వాలి. అయితే వాళ్ల సూచనల ప్రకారం టైర్లలో గాలి ఉండే పరిమాణం సాధారణ ఉష్ణోగతా పరిస్థితుల్లోనే. అధిక ఉష్ణోగ్రత పరిస్థితుల్లో కాదు. వేడి తగిలితే గాలి వ్యాకోచిస్తుందనే సంగతి తెలిసిందే. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు రోడ్లు వేడిగా ఉంటాయి. ముఖ్యంగా 50 డిగ్రీలకు అష్ణోగ్రత చేరిందంటే వేడి ప్రభావం కచ్చితంగా టైర్లపై ఉంటుంది. వేడి తీవ్రంగా ఉన్నప్పుడు ఎక్కువ దూరం ప్రయాణించాలంటే టైర్లలో గాలి వంద శాతం ఉండకూడదని నిపుణులు సూచిస్తున్నారు. రోడ్డుపై ఉండే వేడి ప్రభావానికి గాలి వేడెక్కి టైరు పేలిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఐదు శాతమైనా గాలి తక్కువగా ఉండాలి. సాధారణ గాలికి బదులు నైట్రోజన్ అయితే సురక్షితం. అలాగే నాణ్యమైన టైర్లు మాత్రమే వాడాలి. ఎండలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తే ప్రతి నలభై కిలోమీటర్లకు ఒకసారి ఐదు నిమిషాలు ఆగాల్సిందే.

**ఇంజిన్ వేడెక్కడం:**

ఇతర కాలాలతో పోలిస్తే వేసవిలో పగటిపూట ఇంజిన్ త్వరగా వేడెక్కుతుంది. అందువల్ల ఎండలో బైకులపై ప్రయాణించేటప్పుడు.. అక్కడక్కడా నీడలో ఆగి వెళ్లాలి. కనీసం ఐదు నిమిషాలు ఆగితే ఇంజిన్ కాస్త చల్లబడుతుంది.




బైక్ ఆపినప్పుడు పెట్రోల్ ఆఫ్ చేయాలి. లేకపోతే పెట్రోల్ ఓవర్ ఫ్లో అయి, లీకయ్యే ప్రమాదం ఉంది. ఇంజిన్ వేడిగా ఉన్నప్పుడు పెట్రోల్ లీకైతే మంటలు అంటుకోవచ్చు. ఇంకన్ వేడిక్కి ఓవర్ ఫ్లో అయితే బైక్ త్వరగా స్టార్ట్ కారు. ఇంధనం పూర్తిగా ఆవిరైన తర్వాత్ వాహనం స్టార్ట్ అవుతుంది. కార్లకు సంబంధించి వాహనంలోని రేడియేటర్ ఏసీలో సమస్యలు ఏర్పడతాయి. గ్యాస్ కిట్ ఉపయోగించే వాహనదారులు కిట్ పై వస్త్రం లేదా గోనె సంచి కప్పడం మంచిది. తరచూ గ్యాస్ లీక్ కాకుండా చూసుకోవాలి. రెండు రోజులకోసారి రేడియేటర్ కూలెంట్ స్థాయిని పరిశీలించాలి. కూలెంట్ ఆయిల్ సరైన స్థాయిలో ఉండేలా చూసుకోవాలి. కారు స్టార్ట్ చేయడానికి కొద్దిసేపటి ముందే ఏసీ అన్ చేయాలి.

**నీడలోనే:**

ఎండలు బాగా ఉన్నప్పుడు టూ వీలర్, ఫోర్ వీలర్లను నీడలోనే ఉంచాలి. ఎండలో వాహనాల్ని ఉంచితే వాటి రంగు త్వరగా మారిపోతుంది. బాడీపై చిన్న చిన్న పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితి రాకూడదనుకుంటే వాహనాలను నీడలోనే ఉంచాలి. వాటిపై ఫ్యాబ్రిక్ కవర్స్ కప్పాలి.

వాహనాలకు చెందిన కనెక్టింగ్ వైర్లను చెక్ చేసుకుంటూ ఉండాలి. చాలా మంది ట్యాంకు నిండుగా పెట్రోల్ పోయిస్తుంటారు. వేసవిలో ఎండ వేడికి కొంత మేర పేట్రోల్ అవిరైపోతుంది. అందుకేట్యాంకులో సగానికి మించకుండా పెట్రోల్ పోయించుకోవాలి. ట్రాఫిక్ లో ఎక్కువ సేపు ఆగాల్సి వస్తే ఇంజిన్ ఆఫ్ చేయాలి. ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తే తప్పనిసరిగా 'ఎమర్జెన్సీ రోడ్ సైడ్ కిట్" వెంట ఉంచుకోవాలి.

**ఐదు నిమిషాలు ఆగితే వేడి తగ్గుతుంది...**

బైక్ లను ఎక్కువ సేపు ఎండలో ఉంచితే రంగు పోతుంది. ఎండ వేడికి వాహనాల టైర్లు పగిలే అవకాశం ఉంటుంది. ఎక్కువ సేపు ఎండలో బైక్ నడపరాదు. 40 కిలోమీటర్లకు ఒక్కసారి ఐదు నిమిషాలు విరామం అవసరం. పెట్రోల్ ట్యాంకులు లీకయ్యే ప్రమాదం ఉంది. సాధ్యమైనంత వరకు నీడపట్టునే వాహనాలను నిలిపేలా చూసుకోవాలి. ప్రయాణ సమయంలో చెట్ల నీడలో ఉంచాలి.

# భారత సైన్యం ప్రదర్శించిన పాటవానికి ఒక భారతీయుడిగా నేను గర్వపడుతున్నాను: కేసీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత సైన్యంపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశంసలు కురిపించారు. ఒక భారతీయుడిగా తాను గర్వపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదం సమూలంగా అంతం కావాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పాటవానికి ఒక భారతీయుడిగా నేను గర్వపడుతున్నాను" అని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా అది ప్రపంచ మానవాళికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని కచ్చితంగా



అంతమొందించాలని ఉద్ఘాటించారు. ప్రపంచ శాంతి, సామరస్యాలు నెలకొనాలంటే ఉగ్రవాద నిర్మూలనకు సానుకూల దృక్పథంతో ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. అప్పుడే ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని, శాంతిని స్థాపించగలమని తెలిపారు. భారత సైన్యం ఎంతటి వీరోచితంగా దాడులు నిర్వహించిందో, అంతే అప్రమత్తతతో దేశ రక్షణ విధుల్లో నిమగ్నమై ఉండాలని కేసీఆర్ ఆకాంక్షించారు. దేశ రక్షణ విషయంలో తామెవరికీ తీసిపోమని నిరూపించేలా మన సైనికులకు అపారమైన శక్తి సామర్థ్యాలు ఉండాలని తాను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు సైన్యం నిరంతర అప్రమత్తతతో, శక్తియుక్తులతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆపరేషన్ సిందూర్.. మోదీ ఫస్ట్ రియాక్షన్ ఇదే

**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార దాడులు చేసింది. దీనికి సంబంధించి బుధవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ స్ట్రైక్స్ గురించి ప్రధాని సభ్యులకు వివరించారు. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ఆయన హర్షం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. భద్రతాబలగాలు చేసిన కచ్చితమైె దాడిగా 'ఆపరేషన్ సిందూర్'ను అభివర్ణించారని సమాచారం పీఓకేలో ఐదు, పాక్‌లో నాలుగు ఉగ్రశిబిరాలను ఎలా లక్ష్యంగా చేసుకున్నారో ప్రధాని వారికి చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశ ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును సభ్యులు కొనియాడారని తెలుస్తోంది. ఈ క్యాబినెట్ మీట్ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మోదీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి వీరు సమావేశం అయ్యారు. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదిలా ఉంటే.. 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సంగతి తెలిసిందే. ఇక, ఉగ్రవాద శిబిరాలపై దాడులను భారత ఉన్నతాధికారులు ప్రపంచ దేశాలకు వివరించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్టు అమెరికా, రష్యా, యూకే, సౌదీ అరేబియా, యూఏఈకి సమాచారం అందించారు. మెరుపు దాడులపై వాషింగ్టన్ డీసీలోని భారత ఎంబసీ ప్రకటన విడుదల చేసింది. పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని స్పష్టం చేసింది. ఈమేరకు అమెరికా విదేశాంగ కార్యదర్శితో .. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ మాట్లాడారు.

## సైరన్ మోగగానే ఎక్కడి వాళ్లు అక్కడే ఉండిపోవాలి: సీపీ సీవీ ఆనంద్




**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాం టెర్రర్ ఎటాక్?కు కౌంటర్?గా ఆపరేషన్ సిందూర్? నేపథ్యంలో దాయాది పాక్?, భారత్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ఆదేశాల మేరకు హైదరాబాద్ లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్ డ్రిల్ చేపడుతున్నట్లు సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మాక్ డ్రిల్ రద్దు అంటూ వస్తోన్న వదంతులను నమ్మొద్దని సూచించారు. అత్యసవర సమయాల్లో ఎలా స్పందించాలో ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.ఈ డ్రిల్ లో భాగంగా వైమానిక దాడులు జరిగినప్పుడు ఎలా రియాక్ట్ కావాలో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. దాదాపు 50 సంవత్సరాల తర్వాత వార్ సైరన్ మోగబోతుందని.. సైరన్ మోగినప్పుడు ఎలా వ్యవహరించాలో ప్రజలకు చెప్తామన్నారు. హైదరాబాద్?లోని నాలుగు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి జంక్షన్ లో రెండు నిమిషాల పాటు సైరన్ మోగుతుందని తెలిపారు. వార్ సైరన్ మోగగానే ప్రజలు అలర్ట్‌గా ఉండాలని.. ఇళ్లలో ఉన్నవారు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు.బయట ఉండే ప్రజలు, వాహనదారులు సైరన్ మోగగానే సురక్షిత ప్రాంతాలకు, సమీప భవనాల్లోకి వెళ్లాలని చెప్పారు. సరిగ్గా 4 గంటలకు 2 నిమిషాల పాటు సైరన్ మోగుతుంది. 15 నిమిషాల తర్వాత మరో అలర్ట్ వస్తోందని తెలిపారు. 15 నిమిషాల పాటు 4 ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామన్నారు. గోల్కొండ, కంచన్ బాగ్, సికింద్రాబాద్, ఎన్ఎఫ్సీలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

## తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఏడుకొండలకు ఆనుకొని ఉన్న భూములను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించం

### టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమలలోని అన్నమయ్య భవనంలో బుధవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇది వరకే తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలోని సర్వే నెం.604లో ఆంధ్ర ప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ) కు చెందిన 24.68 ఎకరాల భూమిని టీటీడీకి బదలాయించాలని గతంలో టిటిడి బోర్డు నిర్ణయం తీసుకోవడమైనది. ఆ స్థలానికి బదులుగా తిరుపతి అర్బన్ సర్వే నెం.588-ఏ లో ఉన్న టీటీడీకి చెందిన 24.68 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏ బదలాయింపునకు టిటిడి బోర్డు ఆమోదం తెల్పడమైనది.

అదేవిధంగా తిరుపతి రూరల్ లోని సర్వే నెం.604లోని ఏపీటీఏకు చెందిన మరో 10.32 ఎకరాల స్థలాన్ని టీటీడీకి బదలాయించడం, దానికి బదులుగా తిరుపతి అర్బన్ లోని సర్వే నెంబర్ 588-ఏ లోని టీటీడీకి చెందిన 10.32 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని టిటిడి బోర్డు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడమైనది. ఈ సమావేశంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు వి.ప్రశాంతి రెడ్డి, పనబాక లక్ష్మి, జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నపనేని సదాశివరావు, ఎం.శాంతారామ్, టి.జానకీదేవి, జీ.భానుప్రకాష్ రెడ్డి పాల్గొనగా, వర్చువల్ మీటింగ్ లో జ్యోతుల నెహ్రూ, ఎం.ఎస్. రాజు, ఎస్ నరేష్ కుమార్, సుచిత్ర ఎల్లా, ఎన్.నర్సిరెడ్డి, ఏ.మునికోటేశ్వర రావు పాల్గొన్నారు.

## ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచండి.

**హైదరాబాద్ పెన్ పవర్:** గంగమ్మ ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గంగ జాతర సందర్భంగా ఆలయంలో భక్తులకు కల్పించిన ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ భక్తులతో మాట్లాడి వారికి కావాల్సిన సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతర కు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. క్యూ లైన్ల వద్ద భక్తుల మధ్య తోపులాట జరగకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, ఆలయ ఈ.ఓ. జయకుమార్, ఏసీపీ బాలాజీ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రాజు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు పాల్గొన్నారు.


## కేశినేని నాని సోషల్ మీడియా ట్వీట్ల పై స్పందించిన ఎంపీ చిన్ని

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎంపి చిన్ని కేశినేని నాని ట్వీట్లపై స్పందించారు. నేను ఎక్కడో దాక్కుని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే రకం కాదంటూ నానికి చురకలు అంటించారు. శత్రుదేశంపై దాడి జరుగుతున్న సమయంలో రాజకీయాలు మాట్లాడటం కరెక్ట్ కాదని ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేయలేదు. రెండు రోజుల్లో మీడియా సమావేశంలో తనపై విమర్శలు పై వాస్తవాలు తెలియజేస్తానని అన్నారు.

నా అభివృద్ధిని చూసి నాపై దాడులు చేస్తుంటారు వారికి గట్టి సమాధానం చెప్తా. మీ అందరి సమక్షంలో ఏం జరుగుతుందో తెలియజేస్తానని అన్నారు.

# ఆపరేషన్ సిందూర్ పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ సైన్యంతో మనమంతా అండగా ఉన్నామనే సందేశం ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమయంలో రాజకీయాలు, పార్టీలకు తావులేదని స్పష్టం చేశారు. అత్యవసర సర్వీస్‌లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ఉద్యోగులు అంతా ప్రభుత్వానికి అందుబాటులో ఉండాలని చెప్పారు. మంత్రులు, అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బుధవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆపరేషన్ సిందూర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎస్, డీజీపీలతో పాటు అందుబాటులో ఉన్న మిలిటరీ అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అసవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వాలని అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.




కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిలువలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు.ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటు పైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని అన్నారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు, ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్‌లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ డిపార్ట్ మెంట్ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# టెర్రర్ క్యాంప్‌లు.. జస్ట్ 24 నిమిషాల్లో ఖతం..

**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ పౌరుల ఊపిరి తీసి హాయిగా సేద తీరుతున్న ఉగ్ర మూకలను ఊచకోత కోసింది ఇండియన్ ఆర్మీ. సరిగ్గా తెల్లవారుజాము సమయంలో ఊహించని రీతిలో అటాక్ చేసి ఆ నర రూప రాక్షసుల అంతు చూసింది. 9 ఉగ్ర శిబిరాలపై ఏక కాలంలో 24 క్షిపణులు దాడి చేసి సమస్తం నేలమట్టం చేశాయి. ఇంత విధ్వంసం కేవలం 24 నిమిషాల్లోనే పూర్తవడం విశేషం. పెళ్లై పది రోజులైనా కాకుండా, సింధూరానికి దూరమైన ఆడబిడ్డ కన్నీటి సాక్షిగా ఆపరేషన్ సిందూర్, పేరుతో ఉగ్రమూకల అంతు చూసింది ఇండియన్ ఆర్మీ. మే 7వ తేదీన తెల్లవారుజా మున 1:05 నుంచి 1:30 గంటల వరకు భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం సంయుక్తంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహిం చాయి. కేవలం 24 నిమిషాల్లోనే ఉగ్రమూకల స్థావరాలను నేలమట్టం చేశాయి.

ఇండియన్ ఆర్మీ దెబ్బకు ఉగ్రవాదులు కకావికలం,

24 క్షిపణులు ఏక కాలంలో ఎటాక్ చేయడంతో ఉగ్రవాదులు కకా వికలం అయ్యారు. పేలుడు సంభవించిన సమీపంలోని ఉగ్ర వాదులు భయంతో అటూ ఇటూ పరుగులు తీయడం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో.. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి మాట్లాడుతూ ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా ఈ ఆపరేషన్ జరిగిందని అన్నారు. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలు జరిపిన దాడిలో ఒక నేపాలీ జాతీయుడు సహా 26 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. దీనికి ప్రతిచర్యగానే, ఈ అటాక్ అని స్పష్టం చేశారు.ఈ ఆపరేషన్ వ్యూహంలో మార్పును సూచిస్తుందని కల్నల్ ఖురేషి అన్నారు.గత మూడు దశాబ్దాలుగా, పాకిస్తాన్ పీవోజేకే, పాకిస్తాన్ అంతటా రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, శిక్షణ ప్రాంతాలు, లాంచ్ ప్యాడ్‌లు వంటి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. ఈ ఆపరేషన్ ఆ సౌకర్యాలను కూల్చివేసి భవిష్యత్తులో దాడులను నిరోధించడానికి ఉద్దేశించింది అని ఆమె చెప్పారు. భారతదేశంపై మరిన్ని దాడులు జరగబోతున్నాయని మా నిఘా వర్గాలు సూచించాయి. అందుకే.. ఈ ఉదయం ఉగ్రవాద నిర్మూలనా ఆపరేషన్ చేపట్టాం. మా హక్కును మేము ఉపయోగించుకున్నాం. మా చర్యలు తీవ్రతరం కానివి. బాధ్యతాయుతంగా ఉన్నాయి. ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను కూల్చివేయడంపైనే దృష్టిసారించడం జరిగింది. అని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నారు.

దాడులు జరిగిన ఉగ్రస్థావరాలివే:

ముజఫరాబాద్, కోట్లి, బహావల్పూర్, రావలకోట్, చక్స్వారీ, భీంబర్, నీలం వ్యాలీ, జీలం, చక్వాల్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడులు చేసింది. ఇవన్నీ ఉగ్రవాద శిబిరాలకు స్థావరాలుగా నిఘా సంస్థలు చాలా కాలంగా అనుమానిస్తున్నాయి. ఈ ప్రదేశాలు లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్ లతో అనుబంధంగా ఉన్నాయని బలమైన ఆధారాలు కూడా ఉన్నాయి. ఈ రెండు ఉగ్రవాద సంస్థలు భారతదేశంలో అనేక సంవత్సరాలుగా దాడులకు పాల్పడ్డాయి. ఇక దాడికి గురైన తొమ్మిది ప్రదేశాలలో ఐదు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉన్నాయి. నాలుగు పాకిస్తాన్ ప్రధాన భూభాగంలో ఉన్నాయి. ముఖ్యంగా బహావల్పూర్ జెఎంకు బలమైన కోటగా ప్రసిద్ధి చెందింది. ముజఫరాబాద్, భీంబర్‌లను గతంలో భారత భద్రతా సంస్థలు కాశ్మీర్‌లోకి చొరబడటానికి రవాణా, లాజిస్టిక్స్ పాయింట్లుగా గుర్తించాయి. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ సిందూర్ సూపర్ సక్సెస్ అయ్యింది. లక్షిత స్థావరాలన్నీ ధ్వంసమయ్యాయి. శిక్షణా శిబిరాలు, ఆయుధ గోదాములు, స్టేజింగ్ సౌకర్యాల ధ్వంసమైనట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ విస్తృతంగా జరిగినప్పటికీ.. పాకిస్తాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు.

# టేకులపల్లి మండలంలో 90 ఎకరాలకు ఎల్టీఆర్ కేసు

**భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:**టేకులపల్లి మండలంలోని కొప్పురాయి రెవెన్యూ గ్రామం ఒక మారుమూల ఏజెన్సీ ప్రాంతం. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని అనేక ఏజెన్సీ గ్రామాలలాగే కొప్పురాయి ప్రాంతం కూడా నేతల దయా దాక్షిణ్యాల కోసం ఎదురు చూస్తున్నది. ఎన్నికలప్పుడు తప్ప అధికారులు, నాయకులు దృష్టి పెట్టని ఆదివాసి ప్రాంతాల్లో ఒకటి. ఈ ప్రాంతంలోకి ఎనబయ్యో దశకంలో ఆంధ్రకు చెందిన గుంటూరు ప్రాంతం నుండి అగ్ర వర్ణానికి చెందిన వారు వలస వచ్చారు. అమాయక ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వందల ఎకరాల రెవెన్యూ భూములను వారి కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. అడిగేవారు లేకపోవడంతో మరో అగ్ర వర్ణానికి చెందిన కుటుంబాలను కూడా కొప్పురాయి ఏజెన్సీ ప్రాంతానికి ఆహ్వానించి ఇప్పటి వరకూ సుమారు నాలుగు వందల ఎకరాల వ్యవసాయ భూములను గిరిజన చట్టాలను ఉల్లంఘించి తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. తరతరాలుగా ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగిన ఆదివాసీలకు పట్టుమని ఐదెకరాలకు కూడా పట్టాలు లేకుండా జీవిస్తుండగా ఎనభయ్యో దశకంలో వలస వచ్చిన రెండు అగ్ర వర్ణ కుటుంబాలకు వారితో పాటు వచ్చిన వారి బంధువర్గాలకు ఒక్కొక్కళ్ళకు ఇరవై ఎకరాలకు పట్టాలు కలిగి ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రెవెన్యూ అధికారుల సహాయంతో ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడిచి పట్టాలు పొందడమే కాకుండా అక్కడే పుట్టిపెరిగిన గిరిజనులు అడవికి వెళ్లే దారులను సైతం మూసి ఆదివాసీలపై దౌర్జనానికి దిగుతున్నారు. మామిడి, జామాయిల్ సాగు చేస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారు. వారి స్వాధీనంలో ఉన్న




భూములలో నుండి ఆదివాసీలు నడవడానికి కూడా అనుమతించని అరాచక భూస్వామ్య వ్యవస్థ కొప్పురాయి రెవెన్యూ ప్రాంతంలో వెళ్ళూనుకుంది. గిరిజనులకు చెందవలసిన వందల ఎకరాలను ఆక్రమించుకుంటూ వారిపైనే దౌర్జన్యాలకు దిగుతున్న అగ్ర వర్ణ గిరిజనేతరులపై ఆదివాసులు కన్నెర్ర చేశారు. కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో ఎల్టీఆర్ కేసు నమోదు చేయాలని పదకొండు కుటుంబాలపై ఫిర్యాదు చేయడంతో అందరికీ నోటీసులు వచ్చాయి. దీంతో బెంబేలెత్తిన గిరిజనేతరులు రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ అన్యాయపు రాజీ ప్రయత్నంలో గిరిజన ప్రజా ప్రతినిధులు, ఆదివాసి కుల పెద్దలే ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

**రాజీ పడాలని ఒత్తిడి చేస్తున్నారు: ఎల్టీఆర్ ఫిర్యాదు దారులు**

ఈ కేసును వాపస్ తీసుకోకపోతే గ్రామంలో కొంతమంది అధికార పార్టీకి చెందిన మా గిరిజనులను మా పైకి ఉసుకూలిపి మమ్మలను గ్రామ బహిష్కరణ చేస్తామని అంటున్నారని కన్నీరు మున్నీరు అయ్యారు. భారత రాజ్యాంగంలో గిరిజనలకు కల్పించిన హక్కులు, చట్టాలను రక్షించాల్సిన అధికార పార్టీ నాయకులే ఈ గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ ఎల్టీఆర్ కేసు పెట్టిన గిరిజనులను భయపెడుతూ వందలాది ఎకరాలు ఆక్రమించుకున్న గిరిజనేతరులకు గిరిజననాయకులే వత్తాసు పలకటం తగదన్నారు. ఇది జాతి ద్రోహం అని, తల్లీ పాలు తాగి రొమ్ము గుద్దడం అంటే ఇదే అన్నారు. గిరిజన చట్టాలపై పోరాటం చేస్తున్న మాకు వీరి వల్ల ప్రాణహాని ఉందని తెలిసి కూడా పోరాడుతున్నామని ఇది కేవలం భూపోరాటమే కాదని గిరిజనుల ఆత్మగౌరవానికి సంబంధించిన పోరాటమని ఇందులో తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. గిరిజన సంఘాలు, మేధావులు మీడియా గిరిజనులకు అండగా ఉండాలని కోరారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆశీస్సులు అందరిపై ఉండాలి...

**సూర్యాపేట పెన్ పవర్:**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోదాడ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, పట్టణ సిఐ రజిత రెడ్డి లుఅన్నారు. బుధ వారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా కోదండరామ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అమ్మవారి కటాక్షంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల మధ్య మమతాను నురాగాలు, పరోపకారం భావాలు పెరుగుతాయి అన్నారు మంచి కోసం జరిగే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం నాగు బండి వీరయ్య భద్రమ్మ చారిటబుల్ ట్రస్ట్ కోదాడ ఆధ్వర్యంలో కీర్తిశేషులు ఎర్ర వెంకటనారాయణ జ్ఞాపకార్థం ధర్మపత్ని ఎర్ర భారతమ్మ వారి కుమారులు ఎర్ర శ్రీనివాసరావు ఎర్ర చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు జ్యోతి, వశిష్ట ,గాయత్రి ,అనూష, విదిజ్ఞ చారు హాసినిల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సిఐ రజిత రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గరిని శ్రీధర్ రాయపూడి వెంకటనారాయణ పైడిమర్రి నారాయణరావు జిల్లా జనార్ధన్ బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయి

**హైదరాబాద్ పెన్ పవర్:**

కౌలుకు భూములు సాగు రైతులు భూ యజమాని దగ్గర నుంచి కౌలు పత్రం తీసుకొని వ్యవసాయ మరియు రెవెన్యూ అధికారుల ద్వారా కౌలు రుణ అర్హత పత్రంని పొందిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పీఎం కిసాన్, పంట నష్ట పరిహారము వంటి సంక్షేమ పథకాలు అందుతాయని తహసిల్దార్ పురుషోత్తముడు తెలిపారు. బుధవారం సి.బెళగల్ గ్రామపంచాయతీ నందు రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన కౌలు రైతులకు గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి తహసిల్దార్ పురుషోత్తముడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ పురుషోత్తముడు మాట్లాడుతూ సి.బెళగల్ మండలంలోని అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులు మరియు గ్రామ వ్యవసాయ అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి భూమిలేని రైతులకు వారు సాగుచేస్తున్నటువంటి భూ యజమాని దగ్గర నుంచి ఖచ్చితంగా కౌలు పత్రం తీసుకొని రెవెన్యూ అధికారుల దగ్గర కౌలు అర్హత కార్డు పొందవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఈరన్న గౌడ్, మరియు ఆయా గ్రామాల వ్యవసాయ సిబ్బంది, వీఆర్వోలు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆపరేషన్ సింధూర్ పై స్పందించారు. భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా గర్వపడుతున్నా. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో వున్నా.. ఏ దేశంలో వున్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే. ఉగ్రవాదం అంతం కావాల్సిందే.. ఈ విషయంలో పాజిటివ్గా ఆలోచించే ప్రపంచ శక్తులు ఏకమవ్వాలి. ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతమొందిస్తేనే.. శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత విరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా ఉండాలి . దేశరక్షణలో మేము ఎవరికీ తీసిపోము అన్నట్టుగా.. వారికి శక్తి సామర్థ్యాలు ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

## ఉద్రిక్తంగా భారత్, పాక్ నియంత్రణ రేఖ ప్రాంతం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాక్ నియంత్రణ రేఖ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. భారత్ సరిహద్దు చెక్ పోస్టులు లక్ష్యంగా పాక్ కాల్పులు జరుపుతుంది. కశ్మీర్ సహా సరిహద్దు ప్రాంతాల్లో విచ్చలవిడిగా పాక్ రేంజర్ల కాల్పులు జరిగాయి. పాకిస్థాన్ లో ఉగ్రవాద స్థావరాలను భారత్ ధ్వంసం చేసినప్పటి నుంచి పాక్ కాల్పులు మొదలు పెట్టింది. సుమారు 8 మంది పౌరులు మరణించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పలువురు సైనికులు కూడా గాయపడినట్లు అధికారులు తెలిపారు. ..

## ధీటుగా బదులిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్ మెరుపు దాడులపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందించారు. సమయం చూసుకుని బదులుగా స్పందిస్తామని అన్నారు. మోసపూరిత శత్రువు పాకిస్థాన్ లోని 5 ప్రాంతాల్లో దాడులు చేసింది. భారత్ చర్యలకు పాకిస్థాన్ కచ్చితంగా బదులు తీర్చుకుంటుంది. శత్రువును ఎలా ఎదుర్కోవాలో పాకిస్థాన్ ఆర్మీకి తెలుసు.. ప్రత్యర్థి దుష్ట ప్రణాళికలను ఎట్టి పరిస్థితుల్లోనూ నెరవేరనీయమని అన్నారు. భారత్ దాడులను అయన యుద్ధ చర్యలుగా అభివర్ణించారు.

## చర్య తీసుకునే హక్కు భారత్ కి ఉంది

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ ఆపరేషన్ పై అమెరికా స్పందించారు. భారత్ యాక్షన్ ని కౌంటర్ గా పాక్ ఎటువంటి చర్య తీసుకోవద్దు. భారత్ పై యుద్ధానికి పాక్ ధైర్యం చెయ్యొద్దు. ఉగ్రవాదులపై చర్య తీసుకునే హక్కు భారత్ కి ఉంది. ఆపరేషన్ సింధూర్ పై పాక్ మౌనంగా ఉంటే మంచిదని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మార్కో రుబియా పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో సివిల్ మాక్ డ్రిల్

**హైదరాబాద్ పెన్ పవర్:**పాకిస్తాన్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ సాయంత్రం 4 గంటలకు మొదలైంది. మొదట నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద సైరన్లు మోగించారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కోసం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించేందుకు పోలీసుల మాక్‌డ్రిల్ నిర్వహించారు. హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహణ జరిగింది.నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. సివిల్ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, రక్షణశాఖ, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్ బాగ్ డీఆర్డీఓ, మౌలాలి ఎన్ఎఫ్సీలో అధికారులు మాక్ డ్రిల్ జరగ్గా.. వైమానిక దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో 12 సివిల్ డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు అవగాహన కల్పించారు. దాదాపు అరగంట పాటు ఈ కార్యక్రమం కొనసాగింది.

# సిందూర్ ఆపరేషన్: 25 నిమిషాలు.. 9 ఉగ్రస్థావరాలు.. 80 మంది టెర్రరిస్టులు హతం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకుల మృతికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు పాక్ లోని టెర్రరిస్టుల క్యాంప్ లపై మిస్సైల్స్ తో విరుచుకుపడ్డాయి. మంగళవారం అర్ధరాత్రి భారత సైన్యం.. పాక్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని జైష్-ఎ-మొహమ్మద్ , లష్కరే-ఎ-తోయిబా , హిజ్బుల్ ముజాహిదీన్‌లతో సంబంధం ఉన్న 9 ఉగ్రస్థావరాలపై 25 నిమిషాల పాటు వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 80 మంది ఉగ్రవాదులు మరణించినట్లు భారత అధికార వర్గాలు తెలిపాయి. తొమ్మిది ఉగ్రస్థావరాలను శాటిలైట్ ఫోటోలు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఖచ్చితత్వంతో లక్ష్యాలను ఎంపిక చేసి దాడులు చేసినట్లు భారత త్రివిధ దళాలు వెల్లడించాయి.కాగా, పహల్గామ్ ఉగ్రదాడికి భారత ఆర్మీ.. దాడులు చేసి ప్రతీకారం తీర్చుకోవడంతో దేశవ్యాప్తంగా భారతీయులు ఆనందం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. రాజకీయ నాయకులు, సినీ, క్రీడా ప్రముఖులు భారత ఆర్మీకి సపోర్ట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరోవైపు, ఈ దాడులపై స్పందించిన పాక్.. సమయం చూసి భారత్ పై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించింది.

# సరిహద్దులో పాక్ కాల్పులు.. 15 మంది భారత పౌరులు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సాయుధ దళాలు దాడులు జరపడంతో.. పాకిస్తాన్ ఆర్మీ సరిహద్దు నియంత్రణ రేఖ(ఎల్‌ఓసి) వెంబడి ఉన్న భారత ప్రాంతాలపై కాల్పులకు తెగబడింది. పాక్ రేంజర్ల కాల్పుల్లో మృతి చెందిన భారత పౌరుల సంఖ్య 15కు చేరినట్లు అధికారులు తెలిపారు. పాక్ సైన్యం జరిపిన ఈ కాల్పుల్లో మరో 45 మంది పౌరులు గాయపడినట్లు చెప్పారు. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అమాయక ప్రజలను పాక్ సైన్యం పొట్టనపెట్టుకుందని, దీనికి కూడా ప్రతీకారం తీర్చుకుంటామని భారత సైన్యం హెచ్చరించింది.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్.. 23 మంది మావోయిస్టుల హతం..!

**హైదరాబాద్ పెన్ పవర్:**
: తెలంగాణ %-% ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. వివరాలు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో గత రెండు వారాల పైగా వేల సంఖ్యలో భద్రతా దళాలు మావోయిస్టుల వేటలో నిమగ్నమైన విషయం విదితమే. ఈ క్రమంలోనే ఇప్పటివరకు సుమారు పదిమంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.కాగా తాజాగా బుధవారం ఉదయం బీజాపూర్ జిల్లాలోని కర్రెగుట్ట ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారాసపడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఇప్పటివరకు 23 మంది మావోయిస్టులు నేలకొరిగినట్లు సమాచారం. కాగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతిమ లక్ష్యంగా జరుగుతున్న ఆపరేషన్ "కగార్" స్వల్ప విరామం తర్వాత తీవ్ర రూపం దాల్చింది. ప్రస్తుతం జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు భారీ సంఖ్యలోనే మృతి చెందారు అన్న వార్తలు వినవస్తున్నాయి. అయితే డ్రోన్ కెమెరాల సహాయంతో మావోయిస్టుల కదలికలను పసిగట్టి కాల్పులకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.

# ప్రణాళిక బద్ధంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు జిల్లా ప్రజలకు సమర్థవంతంగా అందేలా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.



బుధవారం రాష్ట్ర మంత్రి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి, కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అనురాధ లతో కలిసి జిల్లాలో అకాల వర్షాల వల్ల పంట నష్టం, సన్న బియ్యం పంపిణీ,ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక, వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు, విద్యుత్ లేకుండా జాగ్రత్త చర్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. రాష్ట్రంలో సామాన్య వ్యక్తులకు, ప్రతి పేదవారికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచితంగా సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ కిరణం తదితర పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా పేదలలో నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అన్నారు. ప్రకృతి చర్యలను మనం ఆపలేమని ప్రకృతి వైపరీత్యాలనుండి రైతుల్ని మనం కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు త్వరగా పేమెంట్ జరిగేలా చూడాలని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నష్టం వివరాలను త్వరగా ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. వర్షాకాలంలో నకిలీ విత్తనాలు మార్కెట్లో చలామణి కాకుండా గట్టి నిఘా ఉంచాలని అన్నారు. ఆయిల్ ఫామ్ జిల్లా రైతులకు వరమని జిల్లాలోనే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతున్నందున వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పెద్ద రైతులను ఒప్పించి ఆయిల్ ఫామ్ పంటను పండించేలా మోటివేట్ చేసి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నేలపాలని అన్నారు. డివిజన్ల వారీగా రైతులతో ఆయిల్ ఫామ్ అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, పెయింటింగ్ వేయని అంగన్వాడీలకు సందేశాత్మకమైన మరియు పిల్లల ఆకట్టుకునే రంగుల బొమ్మలతో పెయింటింగ్ వేయాలని అన్నారు. పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలలో 90 శాతం పైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకు వేదికను ఏర్పాటు చేయాలని అన్నారు. డబుల్ లైన్ రోడ్లకు ఇరువైపులా ఈత, తాటి మరియు ఇతర పండ్లను ఇచ్చే మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. త్రాగునీటికి ఇబ్బంది కలగకుండా వచ్చే వేసవికి కూడా ఇప్పుడే ప్రణాళికలు వేయాలని అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కు బదులుగా స్టీల్ మరియు మట్టితో కూడిన బాటిల్స్, ప్లేట్లు, గ్లాసులు, కుండలను ఉపయోగించేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు, గరిమ అగ్రవాల్,అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ, డిఆర్ఓ, డిపిఓ, డిఈఓ, బిడబ్ల్యుఓ, డిసిఎస్ఓ, డిఎంసివిల్ సప్లై జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, విద్యుత్ శాఖ జిల్లా అధికారి, ఎల్డిఎం తదితరులు పాల్గొన్నారు.